425) శంకరాభరణం

ప॥ అదియే విష్ణుపదము ఆతుమకు నెలవు । అదే జననకారణ మాకాశపదము ॥

చ॥ మంచిమాటలైనా గానిమాటలైన నొకచోట । ముంచిముంచి యాకాశముననే యణగును ।
యెంచరానినిట్టూర్పు లెన్ని వొడమినాను । అంచల నణగిపోవు నాకాశముననను ॥

చ॥ చూపు లెంతదవ్వైనా సూర్యచంద్రుల దాకి । ఆపొంతనే యణగు నాకాశముననను ।
రూపులమైనీడలును రుచుల గాలత్రయము । పైపైనే యణగును బహిరాకాశమున ॥

చ॥ యిల జీకటి వెలుగు యెంచ నహోరాత్రాల । గలసి మెలగు నాకాశతత్వమున ।
చలువై శ్రీవేంకటేశు సాకారనిరాకారా- । లలరి వెలుగుచుండు నంతరాకాశమున ॥